# మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

**• కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు • మహిళల అభ్యున్నతి కోసం నియోజకవర్గంలో మదర్ థెరిస్సా భవనం**



కుట్టు శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, పాల్గొన్న కార్పొరేటర్లు

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 1 : మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా పనిచేస్తున్నదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం ఎన్‌కేఎన్‌ఆర్ గార్డెన్స్‌లో కార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఎమ్మెల్యే కృష్ణారావు సర్టిఫికెట్లను అందజేసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. కేపీహెచ్‌బీ కాలనీలోని కార్డ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు సుమన్ దంపతులు నిరుపేదల అభ్యున్నతికి చేస్తున్న కృషిని అభినందించారు. 1000 మంది మహిళలకు ఉచితంగా శిక్షణ అందించడం గొప్ప విషయమన్నారు. సద్వినియోగం చేసుకుని మహిళలు స్వయం ఉపాధి పొందాలని పేర్కొన్నారు.

**మహిళల కోసం మదర్ థెరిస్సా భవనం..**

కూకట్‌పల్లి నియోజకవర్గంలో 4వేల గజాల స్థలాన్ని కేటాయించామని.. ఆ స్థలంలో మహిళల అభ్యున్నతి కోసం మదర్‌థెరిస్సా పేరుతో భవనాన్ని నిర్మించ నున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ భవనంలో మహిళా బ్యాంకుతో పాటు వివిధ రంగాల్లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తానని తెలిపారు. బీఆర్‌ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శిరీషాబాబూరావు, ముద్దం నర్సింహ యాదవ్, పండాల సతీశ్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు పగుడాల బాబూరావు, తూము శ్రవణ్‌కుమార్, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత : జడ్సీ మమత




రంగధాముని చెరువుగట్టుపై స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్సీ మమత, జీహెచ్‌ఎంసీ సిబ్బందితో కలిసి వ్యర్థాలను తొలగిస్తున్న జడ్సీ



బాలాజీనగర్ కాలనీలో చెత్త తొలగిస్తున్న కార్పొరేటర్ శిరీషాబాబూరావు

కేపీహెచ్‌బీ కాలనీ/ మియాపూర్/ బాలానగర్, అక్టోబర్ 1 : పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ వి.మమత అన్నారు. ఆదివారం మూసాపేట సర్కిల్‌లోని రంగధాముని (ఐడీఎల్) చెరువు, కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్‌లో స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని జడ్సీ మమత ప్రారంభించారు. రంగధాముని చెరువుగట్టు కొలనులో వినాయక విగ్రహాల నిమజ్జన వ్యర్థాలను ఆమె తొలగించి మాట్లాడారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. స్వచ్ఛ ఆటోల్లోనే చెత్త వేయాలని సూచించారు. కార్యక్రమంలో టీసీఎస్ కంపెనీ ఉద్యోగులు, ఇందూ ఫార్చ్యూన్ ఫీల్, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

**యూనివర్సిటీని పరిశుభ్రంగా ఉంచుకోవాలి : జేఎన్‌టీయూ వీసీ కట్టా నర్సింహారెడ్డి**

జేఎన్‌టీయూ వర్సిటీ ప్రాంగణంలో ఆదివారం స్వచ్ఛత హి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్స్‌లర్ కట్టా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. వర్సిటీ, కళాశాల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ గవర్దన్, రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ సైదానాయక్, ప్రసన్న, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**బాలాజీనగర్‌లో..**

బాలాజీనగర్ డివిజన్ కాలనీల్లో ఆదివారం స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని కార్పొరేటర్ పగుడాల శిరీషాబాబూరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఇంట్లోని వ్యర్థాలను ఖాళీ ప్రదేశాల్లో వేయకుండా స్వచ్ఛ ఆటోలకు అందించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వార్డు ఆఫీసర్ ప్రభాకర్, ఎస్‌ఎఫ్‌ఏ వెంకటేశ్, కాలనీవాసులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

**మియాపూర్ పరిధిలో..**

ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ, మహంకాళీనగర్, శంషీగూడలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ పారిశుధ్య సిబ్బందితో కలిసి ఆదివారం స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్మికులతో కలిసి వీధులను శుభ్రం చేశారు. కాలనీవాసులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హైదర్‌నగర్ ప్రధాన రహదారి, భాగ్యనగర్, సమతానగర్‌లో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛతా కార్యక్రమంలో కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు, మహిళా నేతలు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

**ఎంఎస్‌ఎంఈలో శ్రమదానం**

బాలానగర్ నర్సాపూర్ చౌరస్తాలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎంఎస్‌ఎంఈలో ఆదివారం స్వచ్ఛత సర్వేక్షణ్ కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, సిబ్బంది చీపుర్లతో రోడ్లను ఊడ్చి శ్రమదానం చేశారు. కార్యాలయాల్లో ఉద్యోగులు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు. ఎంఎస్‌ఎంఈ అసిస్టెంట్ డైరక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


ఆల్విన్ కాలనీ డివిజన్‌లో చెత్తను ఊడ్చుతున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్, పారిశుద్ధ్య సిబ్బంది


జేఎన్‌టీయూహెచ్‌లో స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో పాల్గొన్న వైస్ ఛాన్స్‌లర్ కట్టా నర్సింహారెడ్డి, రెక్టార్ గోవర్ధన్, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్, విద్యార్థులు


ఎంఎస్‌ఎంఈలో శ్రమదానం చేసిన ఉద్యోగులు


హైదర్‌నగర్ డివిజన్ పరిధిలో కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు, పారిశుద్ధ్య సిబ్బంది

## రాజీవ్‌గాంధీనగర్ నుంచి ఆర్టీసీ బస్సు



ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

అల్లాపూర్, అక్టోబర్ 1 : రాజీవ్‌గాంధీనగర్, సఫ్దార్‌నగర్ బస్తీవాసులకు కలగా మారిన ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సాకారం చేశారు. ఆదివారం అల్లాపూర్ డివిజన్ రాజీవ్‌గాంధీనగర్ ప్రధాన కూడలి వద్ద సఫ్దానగర్ మీదుగా సికింద్రాబాద్ వరకు ఆర్టీసీ బస్సును ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఆర్టీసీ బస్సు ఏర్పాటుతో రాజీవ్‌గాంధీనగర్, సఫ్దార్‌నగర్‌లో నివసిస్తున్న రోజువారీ కార్మికులు, విద్యార్థుల కష్టాలు తీరనున్నాయని పేర్కొన్నారు. కూకట్‌పల్లి డిపో మేనేజర్‌తో మాట్లాడి బస్సు నడిపిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సబీహాబేగం, తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి నివేదన సభ 5కు వాయిదా

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 1 : కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధిపై ప్రగతి నివేదన సభ ఈనెల 5న నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3న కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేజ్‌లో నిర్వహించతలపెట్టిన ప్రగతి నివేదన సభను ఐటీ మంత్రి కేటీఆర్ బిజీ షెడ్యూల్ కారణంగా 5వ తేదీకి వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 5న సాయంత్రం 4 గంటలకు జరిగే ప్రగతి నివేదన సభలో నియోజకవర్గంలోని ప్రజలు, బీఆర్‌ఎస్ పార్టీ నేతలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## వినాయకుడి లడ్డూలు అ‘ధర’హో





కేపీహెచ్‌బీ కాలనీ గోపాల్‌నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి మండపంలో ఆదివారం లడ్డూ వేలం జరిగింది. రూ.8.21 లక్షలకు కాలనీకి చెందిన సుధీర్, గోపీ, శ్రీప్రసాద్, వివేక్ మిత్రమండలి సభ్యులు కైవసం చేసుకున్నారు. అదేవిధంగా కూకట్‌పల్లి భజరంగ్ వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి లడ్డూను వేలంలో రూ.4.15 లక్షలకు ఎంఎస్ నవీన్‌రావు దక్కించుకున్నాడు. – కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 1

## భారతీయ సంస్కృతిని కాపాడుకోవాలి


విజేతలకు సర్టిఫికెట్లను అందిస్తున్న ప్రిన్సిపాల్ జనార్దన్

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 1 : భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని కృష్ణ సింధూరి సంకల్ప కళా నిలయం ప్రిన్సిపాల్ గుమ్మడి జనార్దన్, సెక్రటరీ కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం కేపీహెచ్‌బీ కాలనీలోని కృష్ణ సింధూరి సంకల్ప కళా నిలయంలో జాతీయస్థాయి శాస్త్రీయ తీగ వాయిద్య సంగీత(వయోలిన్, వీణ, సితార్) పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. న్యాయ నిర్ణేతలుగా సాయికుమార్, కేశవదాసు, నవీన్‌కుమార్ వ్యవహరించారు. పోటీల్లో విజేతలైన వారికి నగదు బహుమతితోపాటు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సంకల్ప అధ్యాపకులు రమణ, ప్రకాశ్, విజయభాస్కర్, శ్రీధర్, గోపీకృష్ణ, వినోద్‌కుమార్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కొండాపూర్, అక్టోబర్ 1 : గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీరామ్‌నగర్ కాలనీ కేఎస్ బేకరీ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి(40) పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు డయల్ 100కు సమాచారం అందించారు. పెట్రోలింగ్ సిబ్బంది చేరుకుని 108కు సమాచారం అందించారు 108 సిబ్బంది అతడిని పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.